పంజాబ్ భల్లే భల్లే..

చెన్నైపై అద్భుత విజయం • ప్రియాన్స్ సూపర్ సెంచరీ

ముల్లాన్‌పూర్: ఐపీఎల్‌లో మరో పోరు అభిమానులను కట్టిపడేసింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 18 పరుగుల తేడాతో చెన్నై సూపర్‌కింగ్స్‌పై అద్భుత విజయం సాధించింది. తొలుత పంజాబ్ 20 ఓవర్లలో 219/6 స్కోరు చేసింది. ఓపెనర్ ప్రియాన్స్ ఆర్య(42 బంతుల్లో 103, 7ఫోర్లు,9సిక్స్‌లు) సూపర్ సెంచరీతో కదం తొక్కాడు. చివర్లో శశాంక్‌సింగ్(36 బంతుల్లో 52 నాటౌట్, 2ఫోర్లు, 3సిక్స్‌లు) అర్ధసెంచరీతో పంజాబ్ భారీ స్కోరు అందుకుంది. ఖలీల్, అశ్విన్ రెండేసి వికెట్లు తీశారు. లక్ష్యఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 201/5 స్కోరుకు పరిమితమైంది. కాన్వె (49 బంతుల్లో 69, 6ఫోర్లు, 2సిక్స్‌లు) అర్ధసెంచరీతో ఒంటరిపోరాటం చేశాడు. దూబే (42), ధోనీ(27) రాణించినా జట్టును గెలిపించలేకపోయారు. ఫెర్గుసన్ (2/40) రెండు వికెట్లు తీశాడు. సెంచరీ చేసిన ప్రియాన్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

ప్రియాన్స్ (103)

కాన్వె ఒక్కడే:

నిర్దేశిత లక్ష్యఛేదనలో చెన్నైకి మెరుగైన శుభారంభమే దక్కింది. ఓపెనర్లు రచిన్ రవీంద్ర (36), డేవాన్ కాన్వె పంజాబ్ బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కొంటూ పరుగులు సాధించారు. ముఖ్యంగా కాన్వె దూకుడు కనబరిచాడు. ఇన్నింగ్స్ జోరందుకుంటున్న తరుణంలో బౌలింగ్ మార్పుగా వచ్చిన మాక్స్‌వెల్.. రచిన్‌ను ఔట్ చేసి తొలి వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ వేశాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (1) ఇలా వచ్చి అలా వెళ్లాడు. ఫెర్గుసన్ బౌలింగ్‌లో డ్రైవ్ ఆడబోయిన రుతురాజ్..శశాంక్‌సింగ్ చేతికి చిక్కాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే(27 బంతుల్లో 42, 3ఫోర్లు, 2సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఓవైపు కాన్వె జోరుకు దూబే దూకుడు తోడవ్వడంతో లక్ష్యం అంతకంతకూ తగ్గుతూ పోయింది. వీరిని విడగొట్టేందుకు కెప్టెన్ అయ్యర్ చేసిన ప్రయత్నాల్లో భాగంగా ఫెర్గుసన్ స్లోబాల్‌కు దూబే క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. కాన్వె రిటైర్డ్ ఔట్‌గా పెవిలియన్ చేరగా, ఆఖర్లో ధోనీ(12 బంతుల్లో 27, ఫోర్, 3సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. ఉన్నంత సేపు బ్యాటు ఝుళిపించిన మహీ అభిమానులను అలరించాడు. యశ్ ఠాకూర్ వేసిన చివరి ఓవర్‌లో చెన్నై విజయానికి 28 పరుగులు అవసరం కాగా, ధోనీ వికెట్‌తో పాటు 9 పరుగులే వచ్చాయి.

సంక్షిప్త స్కోర్లు:

పంజాబ్: 20 ఓవర్లలో 219/6 (ఆర్య 103, శశాంక్ 52 నాటౌట్, ఖలీల్ 2/45, అశ్విన్ 2/48)

చెన్నై: 20 ఓవర్లలో 201/5(కాన్వె 69, దూబే 42, ఫెర్గుసన్ 2/40, మ్యాక్స్‌వెల్ 1/11)

శభాష్ ప్రియాన్స్:

పంజాబ్ ఇన్నింగ్స్‌లో ప్రియాన్స్ ఆర్య ఆటే హైలైట్. సహచర బ్యాటర్లు క్రమం తప్పకుండా పెవిలియన్‌కు చేరుతున్నా అతడు ఒంటరి పోరాటం చేశాడు. ప్రభ్‌సిమ్రన్ (0), శ్రేయస్ (9), స్టోయినిస్ (4), వధేర (9), మ్యాక్స్‌వెల్ (1) అలా వచ్చి ఇలా వెళ్లినా ఆర్య ఇన్నింగ్స్‌లో దూకుడు తగ్గలేదు. ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్ బాదిన అతడు.. 19 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేశాడు. అశ్విన్ 12వ ఓవర్లో 2 సిక్సర్లు కొట్టి 80లలోకి వచ్చిన ఈ ఢిల్లీ కుర్రాడు.. పతిరాన 13వ ఓవర్లో 6, 6, 6, 4తో 39 బంతుల్లో తొలి శతకాన్ని నమోదు చేశాడు. 13 ఓవర్లకు పంజాబ్ 151 స్కోరు చేస్తే అందులో ఆర్య చేసిన పరుగులే 100. దూకుడుగా ఆడే క్రమంలో అతడు.. నూర్ వేసిన 14వ ఓవర్లో నిష్క్రమించినా ఆఖర్లో శశాంక్ సింగ్, యాన్సెన్ (19 బంతుల్లో 34 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగంగా ఆడి కింగ్స్‌కు భారీ స్కోరును అందించారు. ఢిల్లీ ప్రీమియర్ లీగ్ (డీపీఎల్)లో మెరుపులు మెరిపించిన ప్రియాన్స్‌ను మెగా వేలంలో పంజాబ్ 3.8 కోట్లకు దక్కించుకుంది. డీపీఎల్‌లో సౌత్‌ఢిల్లీ సూపర్‌స్టార్స్‌కు ప్రాతినిధ్యం వహించిన ఈ 24 ఏండ్ల యువ క్రికెటర్..పంజాబ్ తరపున దుమ్ము రేపుతున్నాడు.

తెలంగాణ ఘన విజయం

జాతీయ సీనియర్ హాకీ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జాతీయ సీనియర్ హాకీ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టు అదరగొట్టింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ 5-1తో గోవాపై ఘన విజయం సాధించింది. మ్యాచ్‌లో తెలంగాణ తరపున సూర్యప్రకాశ్(18ని), అయ్యప్ప(21ని), నీరజ్‌కుమార్(23ని), రోహిత్ సింగ్(28ని), రాజు(29ని) గోల్స్ చేశారు. త్రిశూల్ గణపతి(19ని) గోవాకు ఏకైక గోల్ అందించాడు. ఈ విజయంతో పూల్-ఏలో తెలంగాణ అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది.

కాశ్వీకి పిలుపు

- షెఫాలీకి మరో'సారీ'
- ముక్కోణపు సిరీస్‌కు జట్టును ప్రకటించిన బీసీసీఐ

ముంబై: ఇటీవలే ముగిసిన ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో రాణించిన యువ పేసర్ కాశ్వీ గౌతమ్‌కు జాతీయ జట్టు నుంచి పిలుపొచ్చింది. ఈనెల 27 నుంచి శ్రీలంక, దక్షిణాఫ్రికాతో జరుగబోయే ముక్కోణపు వన్డే సిరీస్‌లో ఆమె హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమ్‌ఇండియాలో చోటు దక్కించుకుంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మంగళవారం జట్టును ప్రకటించగా.. కాశ్వీతో పాటు నిరుడు దేశవాళీ టోర్నీలలో సత్తా చాటిన లెఫ్టార్మ్ స్పిన్నర్లు శ్రీచరణి, శుచి ఉపాధ్యాయకు చోటు దక్కింది. కానీ ఓపెనర్ షెఫాలీ వర్మకు సెలెక్టర్లు మరోసారి మొండిచేయి చూపారు. డబ్ల్యూపీఎల్-3వ సీజన్‌లో ఆమె.. 9 ఇన్నింగ్స్‌లో 304 పరుగులు చేసినా సెలెక్టర్లు ఆమెను పక్కనబెట్టారు. ఈ ఏడాది జనవరిలో ఐర్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో చోటు కోల్పోయిన స్నేహ్ రాణా, యస్తికా భాటియా, అరుంధతిరెడ్డి తిరిగి జట్టులోకి వచ్చారు. ఏప్రిల్ 27 నుంచి శ్రీలంకలో మొదలుకాబోయే ఈ సిరీస్.. మే 11న ముగియనుంది.

సురుచికి స్వర్ణం

బ్యూనస్ ఎయిర్స్: అర్జెంటీనాలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ వరల్డ్ కప్‌లో భారత యువ షూటర్ ఇందర్‌సింగ్ సురుచి స్వర్ణంతో మెరిసింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్ ఫైనల్‌లో 18 ఏండ్ల సురుచి.. 244.6 పాయింట్లు స్కోరు చేసి పసిడిని గెలుచుకుంది. క్వాలిఫికేషన్‌లో 583.16 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన ఆమె.. ఫైనల్‌లోనూ అదరగొట్టింది.

ప్రిక్వార్టర్స్‌కు ధ్రువ్-క్రాస్టో జోడీ

నింగ్బో (చైనా): బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్స్‌లో తొలి రోజు భారత మిక్స్‌డ్ డబుల్స్ షట్లర్లు అదరగొట్టారు. మంగళవారం జరిగిన పోటీలలో భాగంగా భారత ద్వయం ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో.. 15-21, 21-11, 21-11తో హోపంగ-సు యిన్ చెంగ్‌ను చిత్తుచేసి ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. మరో పోరులో అమృత-అషిత్ జోడీ.. 21-9, 21-11తో తులిత్-పాంచాలి (శ్రీలంక)ను ఓడించి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది.

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
ఢిల్లీ	3	3	0	6	1.25
గుజరాత్	4	3	1	6	1.03
బెంగళూరు	4	3	1	6	1.01
పంజాబ్	4	3	1	6	0.28
లక్నో	5	3	2	6	0.07
కోల్‌కతా	5	2	3	4	-0.05
రాజస్థాన్	4	2	2	4	-0.18
ముంబై	5	1	4	2	-0.01
చెన్నై	5	1	4	2	-0.88
హైదరాబాద్	5	1	4	2	-1.62

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

లక్నో లాజవాబ్!

లక్నో: 238/3, కోల్‌కతా: 234/7

పూరన్, మార్ష్ మెరుపులు • రహానే, రింకూ పోరాటం వృథా

పూరన్ (87*)

కోల్‌కతాపై ఉత్కంఠ విజయం

162/3. లక్నో నిర్దేశించిన 239 పరుగుల రికార్డు ఛేదనలో 12.5 ఓవర్లకు కోల్‌కతా స్కోరిది. ఆ జట్టు విజయానికి 43 బంతుల్లో 76 పరుగులు కావాలి. ఇన్నింగ్స్‌లో అప్పటిదాకా కోల్‌కతా ఆడిన ఆటను చూస్తే ఇదేమంత పెద్ద లక్ష్యం కాదు. కానీ రహానే నిష్క్రమణ ఆ జట్టును కుదిపేసింది. 23 పరుగుల వ్యవధిలో నైట్‌రైడర్స్ 5 కీలక వికెట్లు కోల్పోయి ఓటమిని కొనితెచ్చుకుంది. ఆఖర్లో రింకూ సింగ్ పోరాడినా అతడి పోరాటం కేకేఆర్‌ను గెలుపు తీరాలకు చేర్చలేదు. విజయానికి ఆ జట్టు 4 పరుగుల దూరంలో నిలిచింది.

కోల్‌కతా: ఐపీఎల్‌లో మరో హైస్కోరింగ్ థ్రిల్లర్ అభిమానులను ఉర్రూతలూగించింది. కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), లక్నో సూపర్ జెయింట్స్ మధ్య ఈడెన్‌గార్డెన్ వేదికగా ఆద్యంతం ఉత్కంఠభరితంగా జరిగిన భారీ స్కోర్ల మ్యాచ్‌లో విజయం కోసం ఇరు జట్లూ హోరాహోరీగా తలపడ్డా లక్నోనే గెలుపు వరించింది. లక్నో నిర్దేశించిన 239 పరుగుల ఛేదనలో కేకేఆర్ 4 పరుగుల దూరంలో ఆగిపోయింది. పూరన్ (36 బంతుల్లో 87 నాటౌట్, 7 ఫోర్లు, 8 సిక్సర్లు), మార్ష్ (48 బంతుల్లో 81, 6 ఫోర్లు, 5 సిక్సర్లు), మార్క్‌రమ్ (28 బంతుల్లో 47, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) వీరవిహారంతో లక్నో.. నిర్ణీత ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 238 పరుగుల రికార్డు స్కోరు చేసింది. భారీ ఛేదనలో కేకేఆర్.. 20 ఓవర్లలో 234/7 వద్దే ఆగిపోయింది. కెప్టెన్ అజింక్యా రహానే (35 బంతుల్లో 61, 8 ఫోర్లు, 2 సిక్సర్లు),వెంకటేశ్ అయ్యర్ (29 బంతుల్లో 45, 6 ఫోర్లు, 1 సిక్స్)తో పాటు ఆఖర్లో రింకూ సింగ్ (15 బంతుల్లో 38 నాటౌట్, 6 ఫోర్లు, 2 సిక్సర్లు) పోరాడినా ఆ జట్టుకు పరాభవం తప్పలేదు.

రైడర్స్.. తగ్గేదేలే!

స్కోరుబోర్డుపై కొండంత లక్ష్యం కనబడుతున్నా కోల్‌కతా వెరవలేదు. లక్నోకు దీటుగా కేకేఆర్ బ్యాటర్లు దంచుడు మంత్రాన్ని జపించారు. డికాక్ (15), నరైన్ (13 బంతుల్లో 30, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) తొలి వికెట్‌కు 2.3 ఓవర్ల లోనే 37 పరుగులు జోడించి మెరుపు ఆరంభాన్నిచ్చారు. డికాక్‌ను ఆకాశ్ దీప్ మూడో ఓవర్లో వికెట్ల ముందు బలిగొన్నాడు. కానీ రహానే, నరైన్ లక్నో బౌలర్లపై ఎదురుదాడికి దిగడంతో పవర్ ప్లేలోనే ఆ జట్టు ఒక వికెట్ నష్టానికి 90 పరుగులు చేసి లక్ష్యం వైపు దూసుకెళ్లింది. దిగ్వేశ్.. 7వ ఓవర్లో రెండో బంతికే నరైన్‌ను ఔట్ చేసి లక్నోకు బ్రేక్ ఇచ్చాడు. వెంకటేశ్‌తో కలిసి రహానే.. లక్ష్యాన్ని కరిగించాడు. ఈ ఇద్దరూ ఓవర్‌కు పదికి తగ్గకుండా పరుగులు రాబట్టారు.

4 ఓవర్ల వ్యవధిలో ఖేల్ ఖతం..

లక్ష్యం దిశగా సాఫీగా సాగుతున్న కోల్‌కతాకు శార్దూల్ 13వ ఓవర్లో షాకివ్వడంతో ఆ జట్టు గతి తప్పింది. ఆ ఓవర్ చివరి బంతికి రహానే.. పూరన్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత వరుస ఓవర్లలో రమణ్‌దీప్ (1), రఘువంశీ (5)తో పాటు క్రీజులో పాతుకుపోయిన వెంకటేశ్ వికెట్లను కోల్పోయింది. రసెల్ (7) సైతం నిరాశపరిచాడు. 4 ఓవర్లలో 23 పరుగుల వ్యవధిలో ఆ జట్టు 5 కీలక వికెట్లు కోల్పోయింది. 2 ఓవర్లలో ఆ జట్టు విజయానికి 38 పరుగులు అవసరమనగా ఆఖర్లో రింకూ.. 6, 4, 4, 4, 6తో మెరుపులు మెరిపించినా ఆ జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయాడు.

మార్ష్ (81)

దంచుడే దంచుడు..

లక్నోకు ఓపెనర్లు మార్క్‌రమ్, మార్ష్ కలిసి దంచుడుకు బలమైన ముహూర్తం పెడితే.. పూరన్ ఆ విధ్వంసాన్ని నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లాడు. స్పెన్సర్ జాన్సన్ రెండో ఓవర్లో బౌండరీతో మార్క్‌రమ్, సిక్సర్‌తో మార్ష్ బాదుడుకు శ్రీకారం చుట్టారు. అతడే వేసిన 4వ ఓవర్లో ఈ ఇద్దరూ 18 పరుగులు రాబట్టారు. ఈ ద్వయం దూకుడుతో 7 ఓవర్లకే లక్నో వికెట్ నష్టపోకుండా 72 పరుగులు చేసింది. 11వ ఓవర్లో రాణా.. రెండో బంతికి మార్క్‌రమ్‌ను క్లీన్‌బౌల్డ్ చేసి 99 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. మార్క్‌రమ్ ఔట్ అయినా మార్ష్‌కు పూరన్ జతకలవడంతో అగ్నికి ఆజ్యం తోడైనట్టైంది. హర్షిత్ ఓవర్లోనే ఆఖరి బంతిని బౌండరీకి తరలించి ఈ సీజన్‌లో నాలుగో హాఫ్ సెంచరీని నమోదుచేసిన మార్ష్.. ఆ తర్వాత మరింత దూకుడు పెంచాడు. మరో ఎండ్‌లో పూరన్ బాదడంతో లక్నో స్కోరు రాకెట్ వేగాన్ని తలపించింది. నరైన్ 15వ ఓవర్లో రెండు సిక్సర్లు కొట్టిన అతడు.. రసెల్, రాణా బౌలింగ్‌లోనూ బంతిని స్టాండ్స్‌లోకి పంపించి 21 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. రసెల్ 18వ ఓవర్లో పూరన్.. 4, 4, 6, 4, 6తో 24 పరుగులు పిండుకోవడంతో లక్నో భారీ స్కోరు సాధించింది.

సంక్షిప్త స్కోర్లు:

లక్నో: 20 ఓవర్లలో 238/3 (పూరన్ 87 నాటౌట్, మార్ష్ 81, రాణా 2/51, రస్సెల్ 1/32) ; **కోల్‌కతా:** 20 ఓవర్లలో 234/7 (రహానే 61, వెంకటేశ్ 45, శార్దూల్ 2/52, ఆకాశ్ 2/55)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.